

# తెదేపాను వీడను

- పార్టీ కన్నతల్లిలాంటిది
- తెలంగాణతో ఇబ్బంది అన్నానంతే
- బాబే సర్వే చేయిస్తున్నారు
- నా సర్వే అక్కర్లేదు
- తలసాని స్పష్టీకరణ

హైదరాబాద్, న్యూస్‌టుడే: తెదేపా సీనియర్ నేత తలసాని శ్రీనివాసయాదవ్ వ్యవహారం నాటకీయ మలుపులు తిరుగుతోంది. బుధవారందాకా ఆయన తెదేపాను వీడి వెళ్తారని తీవ్రంగా ప్రచారం జరగ్గా గురువారానికి అంతా సర్దుకుంది. పార్టీ కన్నతల్లిలాంటిదని, పార్టీని వీడే ప్రసక్తేలేదని ఆయనే స్వయంగా తేల్చి చెప్పారు. ఇటీవలి పరిణామాల నేపథ్యంలో పార్టీ నియమించిన త్రిసభ్య కమిటీ ముందు హాజరు కావాలని తెదేపా అధినేత బుధవారం తలసానిని ఆదేశించారు. కానీ అనూహ్యరీతిలో ఆయన గురువారం ఉదయమే చంద్రబాబు ఇంటికి వెళ్లారు. ఒకవైపు త్రిసభ్య కమిటీ సభ్యులు ఎర్రన్నాయుడు, యనమల రామకృష్ణుడు, నాగం జనార్దనరెడ్డి ఎన్టీఆర్ ట్రస్టు భవన్‌లో తలసాని కోసం వేచి చూస్తుండగా మరోవైపు నేరుగా చంద్రబాబు ఇంటివద్దకే ఆయన వెళ్లారు. బాబుతో తలసాని గంటకుపైగా ఏకాంతంగా భేటీ అయ్యారు. ఆ తర్వాత బయటకు వచ్చి పార్టీని వీడి వెళ్లేదిలేదని స్పష్టం చేశారు.

ఈ మధ్యకాలంలో చోటుచేసుకున్న అన్ని విషయాల గురించీ చంద్రబాబుతో కూలంకషంగా చర్చించానని తలసాని తెలిపారు. అన్నీ సమసిపోయాయని, ఇక్కడితో ఈ విషయాన్ని వదిలిపెట్టాలని కోరారు. చంద్రబాబుతో భేటీ అనంతరం శ్రీనివాస యాదవ్ విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబూ, తానూ మాట్లాడుకున్నామని, తన బాధలను చెప్పుకున్నానని వివరించారు. ఈ విషయంలో తాను కొంచెం ఎక్కువగా స్పందించడం, పత్రికల్లో రకరకాల కథనాలు రావడంతో కొన్ని ఇబ్బందికర పరిస్థితులు ఎదురయ్యాయని పేర్కొన్నారు. '22 సంవత్సరాలుగా పార్టీలో ఉన్నాను. కన్నతల్లి లాంటి పార్టీని రాబోయే కాలంలో బలోపేతం చేసేందుకు తగిన జాగ్రత్తలు తీసుకుని ముందుకు వెళ్తా' అని తెలిపారు. తెలంగాణవాదం వల్ల పార్టీకి ఇబ్బంది తప్పదని మాత్రమే చెప్పానని పేర్కొన్నారు. పార్టీకి నష్టం తప్పదని అనలేదని వివరణ ఇచ్చారు. ఇబ్బందికీ, నష్టానికీ తేడా ఉందని తెలిపారు. గ్రేటర్ ఎన్నికల్లో పార్టీ తెలంగాణ వాదంతో వెళ్తుందా? లేదా? అన్నది సమయం వచ్చినపుడు పార్టీ చర్చిస్తుందని చెప్పారు. సమైక్యవాదంపై చంద్రబాబు సర్వే చేయిస్తున్నందున తాను చేయిస్తున్న సర్వేను ఆపేస్తున్నట్లు ప్రకటించారు. 'ముఖ్యమంత్రిని ఎప్పుడు, ఎక్కడ కలిశానో మీ దగ్గర రుజువులు ఉంటే చూపండి... అప్పుడు మాట్లాడతా' అని ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. ఇక మీదట ఏదున్నా అధ్యక్షుడితోనే నేరుగా మాట్లాడతానని పేర్కొన్నారు.